


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 11-10-2019 VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 27 పేజీలు : 8 వెల : 1 రూపాయి



సర్వేంద్రియానాం నయనం ప్రధానం

### దృష్టి లోపభూయిష్ట నివారణకే

# డా. వైఎస్సార్ కంటివెలుగు

- కంటిచూపులేకుంటే జీవితమే చీకటి
- ప్రజారోగ్యానికి ప్రాధాన్యత
- అనంతలో 'వైఎస్సార్ కంటి వెలుగు' ప్రారంభం
- ఆరోగ్యశ్రీలో 2వేల వ్యాధులు చేరుస్తాం
- వెనకడిన ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తాం
- ఆనంత జిల్లా రూపురేఖలు మారుస్తా
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

అనంతపురం: డిసెంబర్ 1 నుంచి కొత్త ఆరోగ్య కార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. వైద్యం ఖర్చు రూ. 1,000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 2 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేరుస్తున్నామని వివరించారు. అదేవిధంగా నవంబర్ 1 నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఎంపిక తరువాయి 2లో..



## సెమీస్‌లోకి దూసుకెళ్లిన మేరీకోమ్

### మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డు



మహిళల బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆరు స్వర్ణం, ఒక రజతం కలిపి మొత్తం ఏడు పతకాలు సాధించిన మేరీ కోమ్.. మరోసారి పతకాన్ని ఖాయం చేసుకుంది. -- వార్త 8వ పేజీలో..

## నేడు జగన్‌ను కలవనున్న మెగా స్టార్ చిరంజీవి



అమరావతి: కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరారు. ఈ మేరకు సీఎంవో కార్యాలయం అపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు సీఎం జగన్‌తో చిరంజీవి, రామ్ చరణ్ భేటీ అవుతారు.

తాను కథానాయకుడిగా నటించిన చారిత్రాత్మక చిత్రం 'సైరా నరసింహారెడ్డి'ని వీక్షించడానికి రావాల్సిందిగా సీఎం జగన్‌ను చిరంజీవి కోరనున్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చిరంజీవి తొలిసారి ఆయనతో భేటీ కాబోతున్నారు.

'సైరా' సినిమాను వీక్షించాల్సిందిగా తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను చిరంజీవి ఇటీవల కోరడం, ఆమె కుటుంబంతో కలిసి సినిమా చూసి అద్భుతంగా ఉందంటూ ప్రశంచిన విషయం తెలిసిందే.

తొలితరం స్వాతంత్ర్య పోరాటయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రామ్ చరణ్ నిర్మించిన 'సైరా నరసింహారెడ్డి' చిత్రంపై సినీ ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తుండడం విశేషం.

### విద్యార్థుల్లో నేత్రపరీక్షలు, దోషాల నివారణకై

# డా. వైఎస్సార్ కంటివెలుగు

- కంటి వెలుగులో ఆరు రకాల నేత్ర పరీక్షలు
- గాజువాకలో డా. వైఎస్ఆర్ కంటి వెలుగు ప్రారంభించిన మంత్రి
- నాలుగు నెలల్లో 80% వాగ్దానాలు అమలు
- అగనంపూడిలో రూ.800 కోట్లతో క్రీడా సముదాయం
- పర్యాటక శాఖ మంత్రి ఎం శ్రీనివాసరావు



విశాఖపట్నం: రాష్ట్రంలో అర్హత గల ప్రతి పేదవాడి చెంతకు సంక్షేమ పథకాలను తీసుకు వెళ్తున్నట్లు పర్యాటక సాంస్కృతిక యువజన వ్యవహారాల మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. గురువారం ఆయన గాజువాక ఉన్నత పాఠశాలలో వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కంటి పరీక్షలు చేసి అవసరమైన కళ్ళజోళ్ళు, మందులు శస్త్ర చికిత్స ఉచితంగా చేస్తారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పక కంటి పరీక్షలు చేయించాలి అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి ఎవరూ ఊహించనంతటి ప్రజారంజక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను తరువాయి 2లో..

### దృష్టి లోపాల నివారణే

# వై.యస్.ఆర్.కంటి వెలుగు లక్ష్యం



శ్రీకాకుళం: దృష్టి లేకపోతే సృష్టి కనిపించదని,అటువంటి దృష్టి లోపాలను నివారించేందుకు డా. వై.యస్.ఆర్. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించడం జరిగిందని రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ పేర్కొన్నారు.

**నేత్ర సమస్యలతో చిన్నారులు విద్యకు దూరంకారాదు**

**రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారామ్**

**జిల్లాలో ప్రారంభమైన వై.యస్.ఆర్ కంటి వెలుగు ప్రారంభం**

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డా.వై.యస్.ఆర్.కంటి వెలుగు కార్యక్రమాన్ని శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

చిన్నారులు, పెద్దలలో దృష్టి లోపాలను నివారించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వై.యస్.ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా శాసనసభాపతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల కోసం మంచి కార్యక్రమాన్ని నేడు ఆవిష్కరించడం జరిగిందన్నారు. దృష్టి లేకపోతే సృష్టి కనిపించదని, అటువంటి దృష్టిలోపాలను గుర్తించి వారికి అవసరమైన చికిత్సను అందించడమే డా.వై.యస్.ఆర్.కంటి వెలుగు కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే నానుడి ఉందని, అందులో భాగంగా ఈ పథకం క్రింద ఆరు తరువాయి 7లో..

# టీడీపీ బలోపేతంపై ఫోకస్ పెట్టండి

- విశాఖ నుంచి సమీక్షలకు శ్రీకారం
- మాజీ ముఖ్యమత్రి చంద్రబాబు నాయుడు

విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటనలో భాగంగా గురువారం నగరానికి చేరుకుని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యాలయానికి చేరుకుని దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తరువాయి 7లో..







## అంధత్వాన్ని నివారించి ప్రతీ ఒక్కరి జీవితాలలో

# వెలుగులు ప్రసరింపచేయడమే ప్రభుత్వ లక్ష్యం

### డా. వైయస్సార్ కంటి వెలుగు ప్రారంభోత్సవ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


చోడవరంలో వై.యస్సార్ కంటి వెలుగు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : రాష్ట్రంలో అంధత్వాన్ని పూర్తిగా నివారించి ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు ప్రసరింపచేయడమే ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని, దానిని సాకారం చేసేందుకు తన తండ్రి దివంగత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి పేరుతో డాక్టర్ వై.యస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో కంటి వెలుగు ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవన విధానంలో మార్పుల వలన చాలా మంది పిల్లలు పాఠశాల దశలోనే వివిధ కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతూ, సమస్యను గుర్తించడంలో జాప్యంతో చదువులోను వెనుకబడు తున్నారన్నారు. భవిష్యత్తులో కంటి సమస్యను పాఠశాల దశలోనే గుర్తించి అవసరమైన పరీక్షలు అందించి, చికిత్స, మందులు, కళ్లా ద్దాలు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేపట్టడం జరుగు తుందన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిం చడం జరిగిందని, విద్యార్థినీ, విద్యా ర్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని పాఠశాలల ఉపాధ్యా యులను, విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈవో పి.అచ్చుతరావు,సి.హెచ్.సి, వైధ్యాధికారి డాక్టర్ మహేష్, సత్యశ్రవంతి, వైదేహి, గవరవరం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం వైధ్యాధికారిణి దమయంతి, జీలకర్రరాజు, వై.సి.పి, మండల పార్టీ అధ్యక్షులు పల్లా నరసింగరావు, టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లాడ భవానీ, ఓరుగంటి నెహ్రు, ప్రకాష్, రామకృష్ణ, స్థానిక నాయకులు విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


## డాక్టర్ వైయస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో

# 620మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



పెద్దాపురం : డాక్టర్ వైయస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పులిమేరు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 పాఠశాలల్లో 1002 మంది విద్యార్థులకు గాను 620 మందికి గురువారం కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీరిలో 56 మందికి కంటి చూపు సమస్య గుర్తిం చామని, పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామ్‌నాయక్ తెలియ జేశారు. గురువారం స్కూలు ప్రారం భం కావడంతో కొంతమంది విద్యార్థులు రాలేదని, తిరిగి మంగళవారం మిగిలిన వారికి కూడా కంటి పరీక్షలు నిర్వహి స్తామని డాక్టర్ తెలిపారు.


కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రతి పాఠశాలలోనూ ఒక యోగా టీచర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి కిరణ్ రీజూజూను కోరిన పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు



మెప్మా ఆధ్వర్యంలో నర్సీపట్నం పట్టణ సమాఖ్య మహిళలకు 9 కోట్ల 24 లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కార్యక్రమంలో మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో

# బీచ్ కబడ్డి పోటీలు

### అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్



రావులపాలెం : కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో మొట్ట మొదటిసారిగా రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డి పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ కబడ్డి అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాస్మోపోలిటన్ రిక్రియేషన్ క్లబ్ సమావేశ మందిరంలో సిఆర్‌సి రూపశిల్పి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా॥ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరి), అధ్యక్ష కార్యదర్శులు మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కబడ్డి అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, మాజీ క్రీడాకారుడు ఎన్. అర్జునరావులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రావులపాలెంలో బీచ్ కబడ్డి పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని, రాష్ట్ర నలుమూలలనుండి పాల్గొనేందుకు వచ్చిన కబడ్డి క్రీడాకారులకు సిఆర్‌సి ఆతిద్యం ఇవ్వడం జరుగుతుందని, క్రీడాకారులు ఎటువంటి అసౌకర్యానికి లోనుకాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డి పోటీలు వీక్షించే ప్రేక్షకులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ సిఆర్‌సి రూపశిల్పి విక్టరి వెంకటరెడ్డి పుట్టిన రోజు సందర్భముగా నవంబరు 5, 6, 7 తేదీల్లో బీచ్ కబడ్డి పోటీలు నిర్వహించడం అభినందనీయమని, గతంలో సముద్రాలు, నదుల తీరాల్లో ఇటువంటి క్రీడలు నిర్వహించడం జరిగేవని, అయితే మొట్టమొదటి సారిగా కోనసీమ నడిబొడ్డు రావులపాలెం గంగదొడ్డి మైదానంలో ఇటువంటి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డి మీట్ నిర్వహించడం సిఆర్‌సి రూపశిల్పి డా॥ వెంకటరెడ్డి, మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్‌రెడ్డిల కృషి ఫలితమేనని కొనియాడారు.

రాష్ట్ర స్థాయిలో జరిగే బీచ్ కబడ్డి పోటీలకు 13 జిల్లాల నుండి పురుషులు, స్త్రీలు ఒక్కో విభాగంలో 13 టీమ్‌లుగా పాల్గొంటారని, వీరికి ప్రైజ్ మనీగా 30వేలు, 20 వేలు, 10వేలుగా అందజేయడం జరుగుతుందని, మునుపెన్నడూ లేనివిధంగా పోటీలు నిర్వహిం చడం, ప్రైజ్ మనీ ప్రకటించడం అభినంద నీయమని అన్నారు. కన్నుల పండుగగా సిఆర్‌సి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కబడ్డి పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

# వుయ్‌కేర్‌యు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ




భీమునిపట్నం : వుయ్ కేర్ యు మరియు హెల్పింగ్ హేండ్స్ వారు ఈ మధ్యకాలంలో ప్రారంభించిన దయగల గోడ అనే కార్యక్రమం ను స్పందిస్తూ కేథరిన్ స్కూల్ చిన్నారులు తమ వంతు సహాయాన్ని అందించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్. సుష్మ రాయి ఇచ్చిన పిలుపుకు విద్యా ర్థులు అధిక సంఖ్యలో వారి దుస్తులు సేకరించి వుయ్ కేర్ యు ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేథరిన్ విద్యా సంస్థల అధినేత అలివర్ రాయి పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# 'కంటి వెలుగు' ప్రారంభం

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని విద్యా కమిటీ చైర్మెన్ తిరుపతి రావు సారధ్యంలో స్దానిక వైసీపీ నేత మాజీ ఎంపీపీ శెట్టిబత్తుల.కుమార్ రాజా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సుమారు 100 మందికి రావికంపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంగలక్ష్మి, సత్తిబాబు, పాఠశాల సిబ్బంది, ప్రధానో పాధ్యాయులు ఎమ్.రెడ్డి, రవి మాస్టారు,శర్మ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# సర్వేంద్రియానాం నయనం ప్రధానం

చేసిన 150 ఆస్పత్రులలో వైద్యం చేయించుకునే నిరుపేదలకు ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తామని ప్రకటించారు. గురువారం అనంతపురం జూనియర్ కాలేజీలో 'వైఎస్సార్ కంటి వెలుగు' పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, స్థానిక ప్రజాపతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేత్రదాన శిబిరం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, పోషణ్ అభియాన్, పోషణ కార్యక్రమాలు, తల్లీబిడ్డల ఆరోగ్యం తదితర అంశాలకు సంబంధించిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం కంటి వెలుగు లబ్ధిదారులతో మాట్లాడారు. గురువారం ఉదయమే అనంతకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ జిల్లాలో పలు అభివ ృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మేనిఫేస్టోలో చెప్పకపోయినా ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే ఆయన మాటల్లోనే..

ప్రతి ఇంటిలో ఈ పథకం ద్వారా వెలుగులు నింపాలి

'నేడు ప్రపంచ ద ృష్టి దినోత్సవం. మన కళ్లు ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. అమ్మ అని పసిబిడ్డకు పరిచయం చేసేది కళ్లే. ఏపీలో 2.12 కోట్ల మందికి కంటి సమస్యలు ఉన్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే 80 శాతం సమస్య తీరుతుంది. కంటి సమస్య నిర్లక్ష్యం చేస్తే కంటిచూపు కోల్పోయే పరిస్థితి వస్తుంది. ప్రజల కంటి సమస్యలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మేనిఫేస్టోలో చెప్పకపోయినా ప్రజా ఆరోగ్యం ద ృష్ట్యా.. కంటి వెలుగు ప్రారంభించాం. రూ. 560 కోట్లతో పెద్ద ఎత్తున కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీనిలో భాగంగా ఉచిత చికిత్సతో పాటు, కళ్లద్దాలు కూడ ఇస్తాం. మూడేళ్ల కాలంలో ఆరు దశల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి ఇంటిలో ఈ పథకం ద్వారా వెలుగులు నింపాలి. అక్టోబర్ 10 నుంచి 16 వరకు తొలి దశ కార్యక్రమంలో మొత్తం 70 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తాం.

పథకం గురించి అందరికీ చెప్పండి..

కంటి పరీక్ష తర్వాత చికిత్స అవసరం అయితే నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు రెండో దశ స్క్రీనింగ్, కంటి అద్దాల పంపిణీ, క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు ఉచితం. ప్రజలు పైసా ఖర్చు లేకుండా కంటి వైద్యం చేయించుకోవచ్చు. మళ్లీ ఫి?బ్రవరి 1 నుంచి 3,4,5,6 విడతల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తాం. 3,4,5,6 దశల్లో కమ్యూనిటిబేస్ ఆధారంగా కంటి పరీక్షలు జరుగుతాయి. ఏపీలో ఉన్న 5.4 కోట్ల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తాం. వైఎస్సార్ కంటి పథకం గురించి అందరికీ చెప్పండి.

డయాలసిస్ పేషెంట్లకు రూ. 10 వేల పెన్షన్

త్వరలో 432 కొత్త 108 వాహనాలను ప్రారంభిస్తాం. అదేవిధంగా 676 కొత్త 104 వాహనాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి. వెనకబడిన ప్రాంతాల్లో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తాం. పలాస, మర్కాపురం ప్రాంతాల్లో కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తాం. డిసెంబర్‌లో ప్రజలందరికీ కొత్త ఆరోగ్యకార్డులు ఇస్తాం. మొత్తం 2 వేల వ్యాధులను ఆరోగ్య శ్రీలో చేరుస్తాం. వైద్యం ఖర్చు రూ. 1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తాం. జనవరి 1 నుంచి డయాలసిస్ పేషెంట్లకు రూ. 10 వేల పెన్షన్ ఇస్తాం. నవంబర్ 1 నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో ఎంపిక చేసిన 150 ఆస్పత్రులలో వైద్యం చేయించుకున్న నిరుపేదలకు ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తాం. నేను అనంతపురం జిల్లా మనవడిని.. మా అమ్మ విజయమ్మ మీ జిల్లా ఆడపడుచు. మీ జిల్లా రూపురేఖలు మారుస్తానని హామీ ఇస్తున్నాను'అని సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు.

మధురవాడలో..

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ గురువారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో హాట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మంచి కార్యక్రమాన్ని ఆవిష్కరించారని కంటి చూపు లేక జీవితాలు నాశనం అవుతున్నాయని, కంటి సమస్యలను విద్యార్థి దశ నుంచే గుర్తించి దాని పరిష్కారానికి కృషి చేస్తామని కంటి వెలుగు పథకము నకు రూ.560 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు . ఈ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఆరు రకాల నేత్ర పరీక్షలు జరుపుతామని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు నవంబర్ 1 నుండి డిసెంబరు 31 లోగా కళ్ళద్దాలు పంపిణీ ఉంటుందని. అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో నేత్ర పరీక్షలు జిల్లాలో 3 దశలలో నిర్వహించడం జరుగుతుంది. అక్టోబర్ 10 నుండి 16 వరకు నిర్వహించే మొదటి దశలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలను నిర్వహించి , వారికి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది. నవంబర్ 1 నుండి డిసెంబర్ 31 వరకు నిర్వహించే రెండవ దశలో దృష్టిలోపాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత శస్త్ర చికిత్సలతో పాటు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేస్తామని అలాగే 2020 ఫిబ్రవరి 1వ తేదీ నుండి 2022 జనవరి 31 వరకు మూడోవ దశ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమీషనర్ సృజన, జోనల్ కమీషనర్ బి రాము , పాఠశాల హెడ్ మాస్టర్ రాజా బాబు, నాలుగో వార్డ్ వైకాపా అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి అవంతి శ్రీనివాస్

నర్సీపట్నంలో..

నియోజకవర్గంలోని నర్సీపట్నం బాలికల పాఠశాలలో వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమ శంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోవిందరావు పాల్గొన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథక ప్రారంభ కార్యక్రమంలో ఏర్పాట్లు పేలవంగా ఉండటంతో.. స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నిర్వాహకులపై తన అసంత ృప్తి వ్యక్తం చేశారు.

## విద్యార్థుల్లో నేత్రపరీక్షలు, దోషాల నివారణకై

## డా. వైఎస్సార్ కంటివెలుగు

తెలుసుకుని నవరత్నాలను ప్రకటించారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఉద్యోగాలు కల్పించారని, వాహన మిత్ర పథకం లో ఆటోలు క్యాబ్ డ్రైవర్లకు రూ 10 వేలు ఇచ్చారని ఈరోజు కంటి వెలుగు లో విద్యార్థులకు దృష్టి లోపాలను సరిదిద్దే కార్యక్రమం చేపట్టారని, 15వ తేదీన రైతు భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వర్గీయ వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రజారోగ్య పథకాలైన 108, 104, ఆరోగ్య శ్రీ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని గుర్తు చేశారు. అదే బాటలో ముఖ్యమంత్రి అభివృద్ధి సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టారని చెప్పారు.

వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ కంటి వెలుగుకు రూ.560 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడూ మహిళలు, బాలల గురించి ఆలోచిస్తూ ఉంటారని రుణమాఫీ, అమ్మ ఒడి, కంటి వెలుగు లాంటి పథకాలను రూపొందించారు అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశాన్ని ఆశ్చర్య పోయేటట్లు చేస్తున్నారన్నారు.

అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డా. బి వి సత్యవతి మాట్లాడుతూ పిల్లలు టీవీ సెల్ ఫోన్లు ఎక్కువగా చూడటం మూలంగా దృష్టి మాంద్యం వస్తుందన్నారు. దగ్గరగా చూడటం వల్ల మరింత ప్రభావం ఉంటుందని, ఆహారపు అలవాట్లు కూడా ఏ విటమిన్ తగ్గడానికి దోహదపడతాయని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఉచిత శుక్లాల శస్త్రచికిత్సలు , గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతి మొదలగు కంటి సమస్యలకు ఉచిత చికిత్సలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

విశాఖ పార్లమెంటు సభ్యులు ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి కంటి వెలుగు పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ తో గాజువాక హైస్కూల్లో డైనింగ్ హాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు.

జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎల్ శివ శంకర్ మాట్లాడుతూ కంటి వెలుగులో ఆరు రకాల నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని, చిన్నారులు, పెద్దలు నేత్ర పరీక్షలు చేసుకుని దృష్టి లోపాలను తొలగించు కోవాలని పిలుపునిచ్చారు

అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని అక్టోబర్ 10 నుండి 16 వరకు నిర్వహించే మొదటి దశలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలను నిర్వహించి , వారికి మందులను ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.నవంబర్ 1 నుండి డిసెంబర్ 31 వరకు నిర్వహించే రెండవ దశలో దృష్టిలోపాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత శస్త్ర చికిత్సలతో పాటు ఉచిత కంటి అద్దాలను పంపిణీ మూడవ దశ క్రింద 2020 ఫిబ్రవరి 1వ తేదీ నుండి 2022 జనవరి 31 వరకు జిల్లాలోని ప్రజలందరికీ ఉచిత సమగ్ర కంటి పరీక్షలు మరియు ఉచిత కంటి అద్దాల పంపిణీ ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో 5268 పాఠశాలల్లో 6 లక్షల 16 వేల 166 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ డా జి సృజన శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబురావు, వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. తిరుపతిరావు, జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ డా. నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా దేవి విగ్రహం ఊరేగింపు



విశాఖపట్నం: దేవీ నవరాత్రి మహోత్సవములలో భాగంగా 20వ వార్డులో జిల్లాపరిషత్ ఆటోస్టాండ్ మరియు రామజోగిపేట రామ్ బాయ్స్ మరియు అంగటిదిబ్బ యూత్ ఆధ్వర్యంలో జరిగిన పలు ఊరేగింపు మహోత్సవములలో ముఖ్య అతిధిగా మన్యాల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి యువజన విభాగం 20వ వార్డు మాజీ ప్రెసిడెంట్ పాల్గొని కొబ్బరికాయకొట్టి ఉరేగింపుని ప్రారంభించారు. అంగటిదిబ్బ యూత్ వారి ఆధ్వర్యంలో మన్యాల శ్రీనివాస్‌కి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 20వ వార్డు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవీ నవరాత్రులలో భాగంగా 20వ వార్డు పెంటివీధి ఆంటోనీనగర్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మన్యాల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి యువజన విభాగం మరియు 20వ వార్డు మాజీ ప్రెసిడెంట్ మరియు 20వ వార్డు ముఖ్య నాయకులు కార్యాకర్తలు పాల్గొన్నారు

## ప్రణాళికబద్ధంగా విద్యార్థుల కంటి పరీక్షలు

### ఇన్చార్జి కలెక్టర్ ఎల్ శివశంకర్



విశాఖపట్నం: డా. వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లాలో 6 లక్షల 16 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి కలెక్టర్ ఎల్ శివశంకర్ తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి తప్పక పరీక్ష చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గురువారం గాజువాక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కంటి పరీక్షల సమయంలో మిగిలిన విద్యార్థుల సమయం వృధా అవకుండా పరీక్షలు నిర్వహించిన విద్యార్థులను ఒక్కొక్క తరగతి వారికి సమయాన్ని కేటాయించాలన్నారు. గాలి వెలుతురు ఉన్న గదిని కేటాయించాలన్నారు. సంబంధించిన రిజిస్టర్ లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సదరు రిజిస్టర్లు శాశ్వతంగా ఉంటాయని చెప్పారు. ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిర్ణీత సమయంలో ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ కంటి పరీక్షలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి . జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

## జీవీయంసీ పాఠశాలలో వైయస్‌ఆర్ కంటివెలుగు కార్యక్రమం




సింథియా: పారిశ్రామికప్రాంతం శ్రీహరిపురంలోని జీవీయంసీప్రభుత్వ పాఠశాలలో వైయస్ ఆర్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విధ్యార్థులకు రాష్ట్రీయ బాల సురక్ష కంటి నిపుణులు డా.ఎ.శైలజ, శంకర్‌ఫౌండేషన్ నిపుణులు సదాలు కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాద్యాయుడు ఆర్.వి.వి.ఎస్ నాగభూషణం మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 568 మంది విద్యార్థులకుగాను మొదటి రోజు సుమారు 250మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 16వరకు ఈ కంటి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విధ్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్త జి.కుమారి, ఉపాద్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రంగాలను సంక్షోభంలోకి నెట్టేశారు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

శ్రీకాకుళం: దేశం ఆర్థిక మాంద్యం, ఆర్థిక సంక్షోభాలతో కూరుకు పోయిందని కేంద్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం అని మోడీ ప్రభుత్వం పనితీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, కార్మిక వ్యతిరేక విధానాలపై వామపక్షాల పోరాటంలో భాగంగా శ్రీకాకుళంలోని ఎన్‌ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పనితీరుతో దేశంలో అన్ని రంగాల్లో ప్రగతి కుంటుపడిందని, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు నెట్టేసిందని ఆరోపించారు. దేశానికి పట్టుకొమ్మైన వ్యవసాయ రంగ పరిస్థితి కడు దైనీయంగా ఉందని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర లేకపోవటం తీవ్ర సంక్షోభంలో పడిందని, మద్దతు ధర కల్పించటంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, 2022నాటికి ఆధాయం రెట్టింపు చేస్తామన్న ప్రభుత్వ వాగ్ధానం నీటిమీద రాతేనని, రైతుల బ్యాంకు ఖాతాకు రూ.6వేల జమచేసి చేతులు దులుపుకున్నారే తప్ప వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాల వలన ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గి స్థిరాస్థి రంగం, భవన నిర్మాణ, స్టీలు, సిమ్మెంటు రంగాలు సంక్షోభంలో పడి అమ్మకాలు దారుణంగా పడిపోయాయని, లక్షలాది మంది భవన నిర్మాణకార్మిక కటుంభాలు వీధిన పడ్డాయని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ ప్రజావ్యతికేక విధానాలకు నిరసనగా వామపక్షాలతో కలిసి ఈ నెల 10 నుంచి 16 వరకూ ప్రచారకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా 13న విజయవాడలో వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, 16న




అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో ఉదయం 11 గంటలనుంచి 12 గంటల వరకూ రాస్తారోకోలు చేపట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మఒడి, ఆటో కార్మికులకు ఆసరా పథకాలు ప్రజా రంజకంగా ఉన్నాయని, కానీ ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబనవైపు అడుగులు వేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజలు స్వయంకృషితో ఎదిగే విధంగా ప్రభుత్వ సంస్కరణలు ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందర్‌లాల్, శ్రీకాకుళం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం ద్వారా ఆత్మహత్యల నివారణ

### జిమ్‌సర్ వైద్యనిపుణురాలు డాక్టర్ శ్వేత




సాగర్‌నగర్: ప్రపంచ వ్యాప్తంగా ఏటా 8 లక్షల మంది మానసిక, శారీరక, ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాలలో భారత్‌లోనే ఈ ఆత్మహత్య కేసులు అధికంగా ఉన్నాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆస్పత్రి సైక్రియాట్రీ విభాగం నిపుణురాలు డాక్టర్ చిలుకూరి శ్వేత పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా గురువారం వైద్యకళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు.

ప్రపంచంలో 70 శాతం ఆత్మహత్యలు నిరుపేద దేశాలలోనే సంభవిస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో మహిళల సంఖ్య అధికంగా ఉందన్నారు. ప్రతి 40 సెకండ్లకు ప్రపంచంలో ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్య కేసు నమోదవుతూ ఉందన్నారు. సమీప బంధువులు, అత్యంత సన్నిహితులను కోల్పోయి నైరాశ్యంలోకి వెళ్ళడం, తీవ్ర ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటూ వత్తిడికి గురుకావడం ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందన్నారు. కుటుంబ చరిత్ర, చిన్నతనంలో నిర్లక్ష్యం చేయబడి ఉండటం, ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు పరిగణలోకి తీసుకుని అలాంటి వారికి మానసిక ఆరోగ్య పరిస్థితి సరిచేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల జీవితంపై నమ్మకం కలిగేలా చేయవచ్చున్నారు. ఒకసారి ఆత్మహత్యకు పాల్పడిన వారిని అనుక్షణం గమనిస్తూ మామూలు స్థాయికి తీసుకు రావచ్చునని తెలిపారు.

**వైద్య విద్యార్థుల ఆద్యర్యంలో ర్యాలీ:**

జిమ్‌సర్ వైద్య కళాశాల వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా స్థానిక బీచ్‌రోడ్డులో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం సయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, జిమ్‌సర్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ, మానసిక వైద్య విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్. శ్రీకృష్ణ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

# 17 వరకు ఏపి ఆర్‌సెట్ దరఖాస్తు గడువు పెంపు

### కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాస రావు

విశాఖపట్నం : రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పిహెచ్‌డి, ఎంఫిల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష ఏపి ఆర్‌సెట్ 2019 దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాస రావు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు రూ 2 వేల అపరాద రుసుముతో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను ఈ నెల 24,25 తేదీలలో సరిచేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. హాల్‌టికెట్లను నవంబరు 2వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. పరీక్షలు నవంబరు 08 వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపి ఆర్‌సెట్ 2019కు ఉపాధ్యాకులకు అర్హత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు కలిగి, ఐదేళ్ల వృత్తి అనుభవం కలిగిన వారు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తి సమాచారం www.sche.ap.gov.in/RCET వెబ్‌సైట్ నుంచి పొందవచ్చును. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి పార్ట్‌టైం ఎంఫిల్, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు.

### ఇంజనీరింగ్ పనులు మంజూరు అయిన నాటినుండి

# పూర్తయిన వరకు పర్యవేక్షించండి

### - కమిషనర్ డా॥ జి. సృజన



విశాఖపట్నం : జి.వి.ఎం.సి. పరిధిలో ఇంజనీరింగ్ పనులు మంజూరు అయిన నాటినుండి పూర్తయ్యేవరకు సమీక్షించాలని కమిషనర్ డా॥ జి. సృజన పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైనారు ప్రతి పనిని ఇన్‌స్పెక్ట్ చేసి అంచనాలు రూపొందించాలని పేర్కొన్నారు. ఎం.బుక్స్ పెట్టేటప్పుడు ఏ.ఇలు అన్ని పేజీలను ఎండార్స్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్.ఇలు పనుల పురోగతికి పరిశీ లించాలని పేర్కొన్నారు. పనులు నిర్వహించేటప్పుడు అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బారికేడ్లపై కాంట్రాక్టర్ల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఫైళ్ల నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. వీధి దీపాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా వీధిదీపాల నిర్వహణపై రోజువారి రిపోర్టు సమర్పించాలని పేర్కొన్నారు. గ్రీనరీ సక్రమంగా నిర్వహించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.సమావేశంలో చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు, ఎస్.ఇలు ప్రసాదరాజు, వేణుగోపాల్, రాజారావు, శ్యాంసన్‌రాజు, ఇఇలు వెంకటి, వేణుగోపాలరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైనచూపుకోసమే కంటివెలుగు



పరవాడ:ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనీ ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వము కంటివెలుగుకార్యక్రమం ఏర్పాటుచేసిందనీ పరవాడ మండలము రావాడ పంచాయితీకి చెందిన కావలివాసు,కోనరామారావు,బందం నాగేష్ అన్నారు. గురువారము దర్మారాయుడు పేట గ్రామంలోగల హైస్కూల్ లో వైయస్ అర్ కంటివెలుగుకార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరము అతిథిలు మాట్లడుతూ మెదటిదశలోని కంటి సమస్యలును గుర్తించేందు కుగానూ ప్రతివిద్యార్ధి,విద్యార్థులుకు పరిక్షీలు నిర్వహించడము జరుగుతుందనీ తెలిపారు. అవసరమైన వారికి అపరేషన్లుచేసి మందులు ఉచితంగా ఇవ్వడము జరుగుతుందనీ అన్నారు.కంటిఅద్దాలుకూడా పిల్లలుకుఅందించడము జరుగుతుందనీ అన్నారు.ఈఅవకాశాన్ని ప్రతిఒక్క విద్యార్ధి, విద్యార్ధులు సద్వినియోగము చేసుకోవాలనీ కోరారు. ఈకార్యక్రమంలో కడవలరాజు,కాకిశ్రీను,కె.విఅప్పలరాజు, మేడిశెట్టిఅప్పల రాజు తథితర్లు పోల్గొన్నారు.

**ఉత్తర రైల్వే**

**టెండరు ప్రకటన**

డిప్యూటీ. చీఫ్ ఇంజనీర్/నిర్మాణం, ఉత్తర రైల్వే, లక్నో కొరకు షకుర్‌బస్తీ, ఢిల్లీ వారు భారత రాష్ట్రపతి తరఫున, **సింగిల్ ప్యాకెట్ల పద్ధతిలో** దిగువ పనుల కొరకు **ఇ-టెండరును** ఆహ్వానించారు.

| | | |
|---|---|---|
| 1 | పని పేరు మరియు ప్రదేశము | డిప్యూటీ, చీఫ్ ఇంజనీర్/సి/ఎస్ఎస్‌బి వారు తుగ్లకాబాద్- పల్వాల్‌ల మధ్య 4వ లైన్ సి/డబ్ల్యు కమీషనింగుతో ఇతరత్రా పనులు కొరకు ప్లాట్‌ఫారమ్‌ల విస్తృత నిర్మాణముపనులు మరియు చుట్టుపక్కల ప్రాంతంలో మిగిలిపోయిన ఇతరత్రా పనుల పూర్తి కొరకు |
| 2 | పని పూర్తి చేయుటకు పట్టు కాలము | 12 నెలలు |
| 3 | పని అంచనా విలువ | రూ. 941.65 లక్షలు |
| 4 | ధరావత్తు సొమ్ము ఆన్‌లైన్‌లో డిపాజిట్ చేయుట కొరకు | రూ. 620800/- |
| 5 | రైల్వే వెబ్‌సైట్‌లో టెండరు డాక్యుమెంట్ అమ్మకానికి లభించు తేదీ | ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్ www.ireps.gov.in లో తేదీ 21.10.2019 నుండి 04.11.2019 గం. 11.30ల వరకు లభిస్తుంది. |
| 6 | టెండర్లు అప్‌లోడ్ చేయుటకు ఆఖరు తేదీ/ సమయం | తే 04.11.2019 దీ 11.30 గం.ల వరకు ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్‌లో 21.10.2019 నుండి 04.11.2019 తేదీ వరకు |
| 7 | ఇ-టెండర్ల సమర్పణకు ఆఖరు తేదీ మరియు సమయం | 04.11.2019 11.30 గంటల వరకు (టెండర్లు అప్‌లోడ్ చేసిన వెంటనే ముగియబడుతుంది (డి2) |
| 8 | టెండర్లు తెరచు తేదీ | 04.11.2019 తేదీన టెండరు అప్‌లోడింగ్ ముగిసిన వెంటనే 11.30 గంటలకు |

టెండరు నోటీసు నెం. 364-ఏసీఎస్-సి-ఎస్ఎస్‌బి తేదీ: 09.10.2019 3251/2019

**వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు**

## గీతంలో ఎస్ఎఇ విద్యార్థి విభాగం ప్రారంభం



సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 200 మంది విద్యార్థులు సభ్యులుగా సొసైటీ ఫర్ ఆటోమొబైల్ ఇంజనీర్స్ (ఎస్ఎఇ) విద్యార్థి విభాగం గురువారం ప్రారంభం అయింది. ట్రాన్స్‌మిషన్ కంట్రోల్ ఇంజనీర్, ఆటోమొబైల్ రంగ నిపుణుడు ప్రణీత్ మేడికొండ ముఖ్య అతిధిగా హజరై ఈ విద్యార్థి విభాగాన్ని ప్రారంభించారు. అటోమొబైల్ రంగంలో భారతదేశం అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని యువ ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎలిజిబెత్ రాణి అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్.ఆర్.ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ గీతం విద్యార్థులు ఎస్ఎఇ విభాగం ద్వారా స్వయంగా వాహనాలను డిజైన్ చేసుకోవడంతో పాటు పలు జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. ఆటోమొబైల్ రంగంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగించడం, వర్క్‌షాప్‌లు, సాంకేతిక ప్రసంగాలు ఏర్పాటు చేయడం చేస్తున్నామని వివరించారు. ఎస్ఎఇ విద్యార్థి విభాగం కార్యదర్శి ఎస్ అభినయ్ ఈ ఏడాది నిర్వహించనున్న కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సలహదారు అబ్దుల్ రజాక్, సిహెచ్ కోదండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దయ్యకు అభినందన



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం సిడిసి అసోసియేట్ డీన్‌గా నియమితులైన డాక్టర్ వి.సిద్ధయ్యను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ అభినందించారు. గురువారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సిద్ధయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సిడిసి డీన్ ఆచార్య సి.హెచ్ పాండు రంగా రెడ్డి, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడారంగానికి మరింత ప్రోత్సాహం: ఎమ్మెల్యే నాగిరెడ్డి



గాజువాక: రాష్ట్రంలోని క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసి, క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు వైకాపా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు పోతుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి స్పష్టంచేసారు. ఈ నెల 13వ తేదీ ఆదివారం పోలీస్ బేరాక్స్ క్రీడామైదానంలో విశాఖజిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోషియోషన్ ఆధ్వర్యంలో ఉదయం 6గం. నుంచి సాయంత్రం 5గం. వరకు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఇచ్చె మెడల్స్, సర్టిఫికేట్స్‌ను గాజువాకలో గురువారం నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు క్రీడలలో రాణించి జిల్లాకు రాష్ట్రానికి, దేశానికి పేరుతేవాలని అన్నారు.

జరగనున్న ఈ పోటీలలో హాజరైయ్యే క్రీడాకారులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మద్యాహ్నం లంచ్ ఏర్పాటు చేయడం అయినదని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మంగవరప్రసాద్, ఉపాధ్యక్షులు అండిబోయిన అప్పారావు, వి.అప్పారావు, తాతారావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## భావవ్యక్తీకరణ తప్పుకాదు

దేశంలో విద్వేషదాడులను అరికట్టాలంటూ ప్రధానిని కోరుతూ లేఖ రాసిన ప్రముఖులపైనే రాజద్రోహం కేసు నమోదు చేయడం దిగ్భ్రాంతికరం. దేశ ప్రధానికి లేదా బాధ్యతాయుత స్థానాలలో ఉన్నవారికి చైతన్యవంతులైన ప్రజలు తమ అభిప్రాయాలను లేదా అసమ్మతిని వ్యక్తం చేస్తూ లేఖ రాయడం ఇవాళ కొత్త కాదు. ప్రజాస్వామ్య దేశాల్లో ఇటువంటి భిన్నాభిప్రాయాలను పాలకులు ఆహ్వానిస్తారు కూడా. కానీ ఈ మాత్రం అభిప్రాయ వ్యక్తీకరణే రాజద్రోహమంటూ లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై కేసు దాఖలు కావడం ప్రజాస్వామ్యంలో ఆవాంఛనీయ పోకడ. కొన్నినెలల కిందట రామచంద్రగుహ, మణిరత్నం, అపర్ణ సేన్, శ్యామ్ బెనగల్, శుభా ముద్గల్, అనురాగ్ కశ్యప్, సౌమిత్ర చటర్జీ వంటి ప్రముఖులు అల్పసంఖ్యాక ప్రజలపై, బలహీనవర్గాలపై సాగుతున్న విద్వేషదాడుల పట్ల తమ ఆందోళన వెలిబుచ్చుతూ ప్రధానికి లేఖ రాశారు. అసమ్మతిని వెలిబుచ్చే అవకాశం లేకపోతే ప్రజాస్వామ్యమేలేదని వారు తమ లేఖలో పేర్కొన్నారు. ప్రముఖులు ఈ లేఖ ద్వారా తమ ఆందోళనను ప్రధాని దృష్టికి తెచ్చారే తప్ప మరే దురుద్దేశం వారికి లేదనేది స్పష్టం. వారు దేశ ప్రధానికి లేఖ రాశారే తప్ప విదేశీయులకు కాదు. దేశ ప్రధానికి ప్రముఖులు రాసిన లేఖపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ రెండునెలల కిందట ఒక న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీని ఆధారంగా చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆగస్టు 20న ఇచ్చిన ఆదేశం మేరకు బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఈ నెల మూడవ తేదీన కేసు నమోదయింది. ప్రధానికి లేఖ రాసిన 49 మంది ప్రముఖుల పై రాజద్రోహం, శాంతికి భగ్నం కలిగించే ఉద్దేశంతో మత భావనలను గాయపరుచడం, అవమానించడం మొదలైన ఆరోపణలు చేస్తూ ప్రాథమిక దర్యాప్తు నివేదిక దాఖలైంది. లేఖ రాసిన ప్రముఖులు దేశ ప్రతిష్ఠకు చెరుపు తెస్తున్నారనీ, మెప్పించే రీతిలో సాగుతున్న ప్రధాని పాలనను లోకువ చేస్తున్నారని, వేర్పాటువాద పోకడలకు మద్దతు ఇస్తున్నారని ఈ ఫిర్యాదుదా రు పిటిషన్‌లో ఆరోపించడమే సమంజసంగా లేదు. కాగా దీనిపై చీఫ్ జుడీషియ్ మెజిస్ట్రేట్ అనుకూలంగా స్పందించడం మరింత ఆందోళనకరం. ఈ విమర్శను సహృదయంతో అర్థం చేసుకోకుండా సమాజంలో సామరస్యం నెలకొనాలని కోరుతున్న వారిపైనే శాంతికి భంగం కలిగిస్తున్నారని నిందలు వేసి వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కొన్నేండ్లుగా మత విద్వేషాలు పెరుగుతున్న వనేది తెలిసిందే. అల్ప సంఖ్యాక వర్గాలపై మూక దాడులు సాగుతున్నాయి. బలహీనవర్గాలపై కూడా దాడులు చేసి హతమార్చిన దుర్ఘటనలు ఉన్నా, వీరిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని శిక్షించిన ఉదంతాలు లేవు. ఈ దాడుల మూలంగా మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రపంచంలో ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటున్నాయి. ఈ దాడులను అరికట్టాలని కోరినవారిపైనే దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపించడమేమిటి? 49 మంది ప్రముఖులపై రాజద్రోహం కేసు పెట్టడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. ప్రధానికి లేఖ రాసిన 49 మందికి మద్దతుగా ఈ నెల ఏడవ తేదీన మరో 180 మంది ప్రముఖులు మరో లేఖ రాశారు. నసీరుద్దీన్ షా, రొమిలా థాపర్ తదితరులు మద్దతు లేఖ రాసిన వారిలో ఉన్నారు. తాజాగా మరికొన్ని వందల మంది ప్రముఖులు సౌహార్ద్రత ప్రకటించారు. లేఖలోని అభిప్రాయాలకు మద్దతు ప్రకటించిన ప్రముఖుల సంఖ్య పదమూడు వందలు దాటింది. మేం రోజూ గళం విప్పుతూనే ఉంటాం అని వారు ప్రకటించారు. కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాలు కూడా ప్రముఖులకు మద్దతు ప్రకటించాయి. రాజద్రోహం కేసు పెట్టడానికి సుప్రీంకోర్టు అనేక పరిమితులు నిర్దేశించింది. అల్పమైన అంశాలపై ఇటువంటి కేసులు పెట్టడం సరికాదు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం కూడా అంత అల్పమైన విషయం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యలే స్పష్టం చేశాయి. పౌరులు వాక్‌స్వాతంత్ర్యాన్ని హరించడానికి చట్టాలను ఉపయోగించుకోకూడదు. ఎవరో వ్యక్తి చేసిన ఫిర్యాదు అంటూ బీజేపీ పెద్దలు వ్యాఖ్యానించి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమే. జాతీయ రాజకీయ పక్షంగా అందులోనూ అధికార పక్షంగా ఇటువంటి పోకడలను అరికట్టవలసిన బాధ్యత బీజేపీ నాయకుల మీద ఉన్నది. ప్రధాని మోదీ కూడా తనకు రాసిన లేఖపై జరిగిన రాద్ధాంతం కనుక దీనిపై వెంటనే స్పం దించాలె. ఈ విషయంలో ముజఫర్‌పూర్ న్యాయస్థానం చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ నిర్ణయం విమర్శలకు తావిస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను కాపాడటంలో మన దేశంలో న్యాయవ్యవస్థ ఎంతో కీలకపాత్రను పోషిస్తున్నది. మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో న్యాయస్థానాలు పోషించిన పాత్ర విస్మరించలేనిది. తాజా ఉదంతంలో కూడా పట్నా ఉన్నత న్యాయస్థానం స్వతహాగా చొరవ చూపి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలె. రాజద్రోహం చట్టమే వలసవాదుల పాలన నాటి కాలం చెల్లిన చట్టమని, దీనిని రద్దుచేయాలని ఎంతో కాలంగా ఒక బలమైన వాదన ఉన్నది.

# తూర్పులో 'వైఎస్సార్ కంటి వెలుగు' ప్రారంభం




కాకినాడ: తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని గురువారం డిప్యూటీ సీఎం సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అటు విద్య..ఇటు ఆర్యోగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. జిల్లాలో ఏడు లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. రేపటి తరం కోసం ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ 'వైఎస్సార్ కంటి వెలుగు' పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వమే ప్రజలకు ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించి, కళ్ల అద్దాలు ఇస్తుందని...అవసరమైతే కంటి ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, పంచాయితీ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

క ృష్ణా జిల్లా: పెనమలూరు నియోజకవర్గం కానూరు జడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి, జాయింట్ కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కంటి పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తాతినేని పద్మావతి,ఎంపీటీసీ ఛాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా: నర్సాపురంలోని లెనిన్ హైస్కూల్లో వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు లక్షా 60 వేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థి, విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కర్నూలు జిల్లా: కల్లూరు మండలం జెడ్పీ హైస్కూలులో వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవిష్యత్ తరాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ద ృష్టి పెట్టారని తెలిపారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ద ృష్టిలోపాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో కంటి వెలుగు పథకాన్ని సీఎం ప్రారంభించడం అభినందనీయమని కాటసాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.

## జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన' వైయస్ఆర్ కంటివెలుగు' కార్యక్రమం

**- అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు - ముఖ్యమంత్రి పనులు చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి**

**- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు**




గాజువాక : అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందించేందుకు రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం కృతనిశ్చియంతో ఉందని రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేసారు. గురువారం గాజువాక హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్ఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని విశాఖజిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి కంటిచూపు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని అన్నారు. రాష్ట్రమొత్తంమీద సుమారు రూ. 560కోట్లతో ఈ కంటి వెలుగు పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఈనెల 16వరకు తొలిదశ కంటివెలుగు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 62వేల స్కూళ్ళకు చెందిన 70లక్షల మంది విద్యార్డులకు ఈ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే ఈ పథకాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పక్షాలు వైకాపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం సమావేశాలను హొటల్‌లలో నిర్వహించేవారని, ఈ ప్రభుత్వం మాత్రం ప్రజల మద్యనే కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ది చేందేవిధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గాజువాక అగనంపూడి ప్రాంతంలో 800కోట్లతో స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్నివర్గాలవారికి న్యాయం జరుగుతుందని, అన్ని రంగాలలో అభివృద్దిని సాధించి దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే తపనతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్ అహార్నిషలు పాటుపడుతున్నారని అన్నారు. అనంతరం కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి ఎంపీలు యం.వి.వి.సత్యన్నారాయణ, సత్యవతమ్మ, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, గుడివాడ అమర్‌నాధ్, గొల్లబాబురావు, కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే డా.మళ్ళవిజయప్రసాద్, వియంఆర్‌డిఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, నాయకులు కొలాగురువులు, అక్కరమాని విజయనిర్మల, ఇంచార్జ్ కలెక్టర్ శివశంకర్, జీవీయంసీ కమీషనర్ సృజన, విశాఖజిల్లా వైద్యాధికారి తిరుపతిరావు, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, పెంటారావు, దర్మాల శ్రీను, రమణి, జగన్నాథం, కార్యకర్తలు, విధ్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## కర్తవ్య పాలన

కర్తవ్యోన్ముఖులను గావించునది
ఋణమార్గంలో నడిపిస్తూ
గమ్యానికి చేర్చునది
అరిషడ్వర్గాలను లోబరుచుకొని
కోరికల గుర్రాలకు పగ్గాలు వేసి
శాంతి, అహింస, కరుణ, ప్రేమ
దైవిక గుణాలను అలవర్చునది
భక్తి కరదీపిక భగవద్గీత
ఇష్టదేవతా సాక్షాత్కార మొనరించునది
భక్తి, జ్ఞాన,యోగ మార్గములలో
జీవితానికి దివ్యత్వం ఒసంగునది
స్వస్వరూప సాక్షాత్కారం ప్రసాదించునది
సకల మానవాళికి కర్తవ్య పాలన దిశగా
నడిపించు దివ్య, పవిత్ర గ్రంథం భగవద్గీత

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి : త్రయోదశి రా.9.32; పూర్వాభాద్ర తె.5.30; ఉ.వ.10.00ల 11.46.

**శుక్రవారం 11-10-2019**

**మేషం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **మిధునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవ సరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కార మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమిత పడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సా హకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యో గస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహిం చటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమి కుల అత్యుత్సాహం అనర్థా లకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంత మంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహా యం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారు లకు అన్నివిధాలా అను కూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొం టారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విష యాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావల సిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సా హకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. కుటుంబీకుల



# లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!

## సంకీర్తన

లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోదై, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణుచిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామి వారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణు చిత్తుడు బాధపడుతుంటే.. రంగ నాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. ంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటు న్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది. దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days

# శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవములు



మురళీనగర్ : విశాఖ ఉత్తర నియోజకవర్గం 37వవార్డు బర్మా కాంప్, శ్రీనివాసనగర్ లో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రులు మహోత్సవములు అమ్మవారి ఊరేగిపు కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 37 వార్డు అధ్యక్షులు బొడ్డేటి నాగేశ్వరావు (నాగు), శ్రీను, గణేష్, రంజిత్, నీలి రవి,రాంబాబు,బుజ్జి,37వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ మంత్రి వర్యులు ధర్మాన కృష్ణదాస్‌ని నరసన్నపేటలో మర్యాద పూర్వకంగా కలిసిన జాయింట్ కలెక్టర్-2 రెడ్డి గున్నయ్య



## ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఇంటిపై ఏసీబీ దాడులు

నెల్లూరు: తెలుగుగంగ ప్రాజెక్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ నరసింహం ఇంటిలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఏసీబీ సోదాలు చేపట్టింది. లక్ష్మీనరసింహం నివాసంతోపాటు బంధువుల ఇళ్లల్లోనూ తనిఖీలు జరిగాయి. నెల్లూరు, కావలి, రాజమండ్రి, ఒంగోలులో సోదాలు నిర్వహించారు. రాజమండ్రి, ఒంగోలులో పొలాలు, ఇళ్ల స్థలాలు ఉన్నట్టు గుర్తించారు. సోదాల సందర్భంగా భారీగా బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. లక్ష్మీ నరసింహం పేరుతో కావలిలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ కూడా ఉన్నట్టు గుర్తించారు. ఇతని అక్రమాస్తుల విలువ దాదాపు 25 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

# 150 రైళ్లు..50 స్టేషన్లు ప్రైవేటుపరం

న్యూఢిల్లీ : భారత రైల్వేల ప్రైవేటీకరణ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. తేజాస్ రైలును ప్రవేశపెట్టిన అనంతరం తాజాగా మరో 150 రైళ్లు, 50 రైల్వే స్టేషన్లను దశలవారీగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్రం గురువారం నిర్ణయించింది. కేంద్ర నిర్ణయం గురించి నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ముందకు తీసుకువెళ్లేందుకు సాధికార కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుందని లేఖలో కాంత్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల ప్రైవేటీకరణ అనుభవాన్ని ప్రస్తావిస్తూ రైల్వేల్లోనూ ఇదే తరహాలో ప్రైవేటీకరణ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లేందుకు కార్యదర్శులతో కూడిన సాధికార కమిటీ ఏర్పాటవుతుందని రైల్వే బోర్డు ఛైర్మన్ వీకే యాదవ్‌కు రాసిన లేఖలో అమితాబ్ కాంత్ తెలిపారు.

ప్రయాణీకుల రైళ్ల నిర్వహణను ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించే ప్రక్రియతో ఈ రైళ్ల నిర్వహణలో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు.

## *ప్రభుత్వ ప్రాధమిక పాటశాల ను ప్రారంభించిన ఎంపీ గొడ్డేటి మాధవి*

కొయ్యూరు : మడలంలో రేవెళ్ల గ్రామంలో స్కూల్ ను, ఎంపీ మాధవి గురువారం ప్రారంభించారు. గతంలో ఇక్కడ ఎయిడెడ్ పాటశాల లో పనిచేసిన టీచర్ రిటైర్మెంట్ అవ్వటంతో ,స్కూల్ మూత పడింది .

ఎన్నో సార్లు అధికారులు దృష్టి కి తీసుకు వెళ్లిన , ఫలితం లేకపోయిదని, ఎంపీ మాధవి చొరవతో రేవెళ్ళ గ్రామంలో స్కూల్ రావటం తో గ్రామస్తులు, ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఎల్ల. కల నెరవేరి టంతో ,గ్రామం లో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఎంపీ గొడ్డేటి మాధవి కొయ్యూరు లో సి. ఏ. హెచ్ స్కూల్లో వ్యాయామశాల ను ప్రారించారు .

రెజ్లింగ్ సెంటర్ లో విద్యార్థులు కు కావలసిన అవసరాలను ప్రభుత్వ కల్పిస్తుందని ,గిరిజన ప్రాంతాన్ని, అభివృద్ధి పదంలో నడిపించి , గిరిజన విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని, వెలికతీసేందుకు , వ్యాయామశాల దోహద పడుతుందని మాధవి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డైరెక్ట్ విజయ్ కుమార్ , స్పెషల్ ఆఫీసర్ పార్వతమ్మ , ఏపీ డబల్యు ఓ శ్రీనివాసరావు, ఎంపీడీపీ రెహమాన్, ఎం ఈ ఓ బొడం నాయుడు,తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోడు భూమి సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలి



అనంతగిరి : అరకులోయ నియోజకవర్గం, హుకుంపేట,. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు వ్యతి రేకంగా నూతన ఆటవీ విధానం తెస్తుంది. ఈ నూతన అటవీ విధానం వలన 5 వ షెడ్యూల్, షెడ్యూల్ ప్రాంతంలో నివ శిస్తున్న గిరిజనుల అడవులు, భూమి, గ్రామ సభ హక్కులు గిరిజనులకు లేకుండా పోతున్నాయని అడవిని నమ్ముకున్న గిరిజనులు అడవి మీద హక్కులు లేకుండాపోతున్నాయని గిరిజన ప్రాంతాల్లో అపార మైన సహజ వనరులు ప్రైవేటు బడా వ్యక్తులకు ధారాదత్తం చేస్తుంది. కేంద్రప్రభుత్వం తెస్తున్న నూతన ఆటవీ విధానానికి వ్యతిరేకంగా సిపిఎం ఆలిండియా కమిటీ పిలుపు మేరకు ఈనెల 10 నుండి 16 వరకు ఏజెన్సీ 11 మండలాలలో రాస్తారోకో కార్యక్రమం చెయ్యాలని సిపిఎం పిలుపు ఇస్తుందిఅని ఈరోజు హుకుంపేట మండ లంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కిల్లోసురేంద్ర మాట్లాడుతూ...

ఏజెన్సీ 11 మండలంలో సాగుచేస్తున్న పొడుభూమి సాగుదార్లకు అటవి హక్కులచట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని. కేంద్రప్రభుత్వం అను సరిస్తున్న ఆర్థికవిదానాలకు వ్యతిరేకంగా పోరాటానికి గిరిజనులు సిద్ధం అవ్వాలని పిలుపు ఇవ్వడమైనది. దేశంలోఆర్థిక మాంద్యం వలన లక్షల మందికి ఉపాధి కోల్పోవడం జరుగుతుందని, నిరుద్యోగం పెరుగుతుంది. పెట్టుబడిదారులకు ప్రభుత్వం లక్షలకోట్లు రాయితీ ఇస్తుంది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని. ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు పర్చాలని, కార్మికులకు కనీస వేతనం 21 వేలు చెల్లించాలని. వృద్ధాప్య, వితంతువులు తదితర పించన్లు 3 వేలు రుపాయలకు పెంచాలని డిమాండ్లపై సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఏజెన్సీలో 11 మండలాలలో. రాస్తారోకోలు. నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు దీనికి గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం పిలుపు నిచ్చిందని విజయభాను ప్రతినిధితో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కిలో సురేంద్ర తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం హుకుంపేట కార్యదర్శి వి.లక్ష్మీ యెస్.హైమావతి. కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## చోడవరం భవిత కేంద్రను ఆకస్మిక తనిఖీ చేసిన సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి



చోడవరం మెయిన్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి బి.మల్లిఖార్జునరెడ్డి

చోడవరం : చోడవరం పట్టణంలోని భవిత కేంద్రం, మండల పరిషత్తు ప్రాధమిక(మెయిన్)పాఠశాలను ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష విశాఖజిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.మల్లిఖార్జునరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల ఆంగ్ల, గణితం పరిజ్ఞానం పరిశీలించారు. డిజిటల్ తరగతులు, బోధనాపరికరాల విని యోగంపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవడం అలవరచు కోవాలని, అనవసర వాటి జోలికి పోకుండా ఉన్నత లక్ష్యాలు ఏర్పర చుకుని ప్రణాళికా బద్ధంగా సన్నద్ధమవ్వా లన్నారు. ప్రాధమిక దశలోనే మంచి అలవాట్లు పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.అచ్చుతరావు, సి.ఆర్.పి, కె.వి.ఎం. నాయుడు, సరస్వతిదేవి, చెల్లయ్య మ్మ, రామారావు, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులు పట్ల శ్రద్ధగా బాధ్యత వహించాలి

## ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్




ప్రపంచ నిరాశ్రయులు దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో మానవహారం

నర్సీపట్నం : నిరాశ్రయులను పునరావాస కేంద్రంలోనే ఉంచకుండా వారి బంధువులతో కలపాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు ప్రపంచ నిరాశ్రయులు దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో లో మానవహారం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశారు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పునరావాస కేంద్రంలో ఉన్న మధ్యప్రదేశ్ కు చెందిన వ్యక్తితో మాట్లాడారు రు నా సదరు వ్యక్తిని ఏవిధంగా నైనా వారి కుటుంబ సభ్యులకు చేర్చే విధంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు దీనికి సంబంధించి సోషల్ మీడియాలో ప్రత్యేకంగా పోస్టు పెట్టారు.

కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సీ పట్నం మున్సిపల్ కమిషనర్ మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రవి ఆర్‌పిసిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిరాశ్రయులైన కేంద్రం వద్ద మొక్కలను నాటారు అక్కడ ఉన్న నిరాశ్రయులకు పండ్లను పంపిణీ చేశారు.

# వైఎస్సార్ కంటివెలుగు ప్రారంభం



భీమునిపట్నం : ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా, "అంధత్వనివారణ" లక్ష్యంగా రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి "డా.వై.యస్.ఆర్. కంటి వెలుగు" కార్యక్రమంను ప్రారంభించిన సందర్భంగా గురువారం భీమునిపట్నం మండలం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సెయింట్ ఆన్స్, అంబేద్కర్, మున్సిపల్ స్కూల్ తదితర పాఠశాలలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. "డా: వై.యస్.ఆర్. కంటి వెలుగు" కార్యక్రమంలో భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి సూరింటెండెంట్ దిద్దే సిదార్ధ కుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ టీచర్లు, ఎ.ఎన్.ఎంలు, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కంటి వెలుగు ప్రతి ఇంటికి వెలుగు

## *డీసీసీబి ఛైర్మన్ యు.సుకుమారవర్మ (తేజ)*



అచ్యుతాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటిలో వెలుగు నింపడానికి నవరత్నాల పథకాలతో పాటు వైఎస్ఆర్ కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టారని డీసీసీబి చైర్మన్ యు సుకుమార వర్మ (తేజ) అన్నారు . గురువారం మండలంలో హరిపాలెం గ్రామంలో వైఎస్ఆర్ కంటి వెలుగు పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుకుమార వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వైఎస్ఆర్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరు విడతలుగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో మొదటి విడతీగా విద్యార్థులకు నిర్వహిస్తున్నారని తరువాత ప్రజలందరికి నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిది పిన్నంరాజు వాసు, వైసిపి మండల కన్వీనర్ మారిశెట్టి సూర్యనారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు త్రినాధ స్వామి, పిహెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుడ్ని దర్శించిన హైకోర్టు జడ్జి యు.దుర్గాప్రసాద్



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని హైకోర్టు జడ్జి యు.దుర్గాప్రసాద్ శ్రీ స్వామివార్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ ఈవో వి.త్రినాధరావు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అనంతరం ఈవో త్రినాధరావు శ్రీ స్వామివారి ప్రసాదమును, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్, సూపరింటెండెంట్ గొల్లు.సత్యనారాయణ,ఆరై భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం స్నేహ లాడ్జిలో దంపతులు ఆత్మహత్య



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక శివారున గల స్నేహ రెసిడెన్సి లాడ్జిలో ఆరో తారీఖున రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కు చెందిన పవన్, దివ్య లక్ష్మి దంపతులు రూమ్ తీసుకోవడం జరిగింది. రెసిడెన్సి సిబ్బందికి అనుమానం వచ్చి పరిశీలించగా దంపతులు ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు కనబడటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, స్థానిక ఎస్సై మురళీమోహన్ తమ పోలీసు సిబ్బంది తో వచ్చి పరిశీలించగా తాము ఆర్థిక ఇబ్బందుల వల్ల చనిపోతున్నాము అని మా చావుకు ఎవరూ కారణం కాదని, బ్రతికున్నప్పుడు హైదరాబాదులో ప్రశాంతత లేదని, కనీసం చనిపోయినప్పుడు అయినా పుణ్యక్షేత్రంలో చనిపోదాం అనే ఉద్దేశంతో అన్నవరం రావడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## *డాటా ఎంట్రీ పక్కాగా ఉండాలి*

### జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : వై.యస్.ఆర్. కంటి వెలుగు మరియు వై.యస్.ఆర్. రైతు భరోసా కార్యక్రమాల డాటా ఎంట్రీలను పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ మండల అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వై.యస్.ఆర్.కంటి వెలుగు, రైతు భరోసా కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ మండల అధికారులతో టెక్కలి నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై యస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల డేటా ఎంట్రీ పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రైతు భరోసా కార్యక్రమంలో అర్హులు, అనర్హులు, వివిధ కారణాలతో పరిశీలించవలసిన జాబితాలను ఇప్పటికే గ్రామాల్లో ప్రదర్శించడం జరిగిందని, వాటిని పరిశీలించి తుదిజాబితాను 11 వ తేదీ (శుక్రవారం)లోగా సమర్పించాలని అన్నారు. రైతు ఖాతాల్లో నేరుగా రైతు భరోసా మొత్తం జమ అవుతున్నందున వెబ్ ల్యాండ్, ప్రజా సాధికార సర్వేలో సరిపోయిన రైతుల యొక్క ఆధార్ తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలను తప్పనిసరిగా పొందుపర్చాలని సూచించారు. సాధ్యమైన మేరకు అర్హులైన లబ్ధిదారులు అందరూ ప్రయోజనం పొందేలా చూడాలని చెప్పారు. ఇందుకోసం ప్రజా సాధికార సర్వేను గ్రామాల్లో చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామాల వారీగా తేదీలు ఇచ్చి గ్రామాల్లో వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా కార్యక్రమం శాసనసభ నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 15వ తేదీన నిర్వహించాల్సి ఉందని, అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ యజమానులు, కౌలు రైతులు, సాగు చేసున్నవారికి రైతు భరోసా పంపిణీ అవుతుందని తెలిపారు. రైతు భరోసా కార్యక్రమంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబందించిన ప్రదర్శనలను ఏర్పాటుచేయాలని, ముఖ్యంగా భూసార పరీక్షల లాబ్, ధృవీకరణ చేసిన నాణ్యమైన విత్తనాల వివరాలు తెలియజేసే కియోస్క్, గ్రామ సచివాలయం మోడల్, సమీకృత వ్యవసాయం, చిరుధాన్యాలు, పంటల బీమా వంటి పలు ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, కార్యాలయాల్లో స్పందన ఆడిట్ చేసి పనితీరును మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు వారం రోజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఇందుకు బ్యాచుల వారీగా శిక్షణ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుండి నవంబరు 16 వరకు బ్యాచుల వారీగా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఒక్కో బ్యాచుకు వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేట వద్ద గల వైష్ణవి కళాశాలలో శిక్షణా కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు.

# నోటీసుబోర్డులో ప్రచురించిన రైతు భరోసా జాబితా



పెద్దాపురం : రైతు భరోసా జాబితాను మండలం లోని అన్ని గ్రామాల సచివాలయాల్లో ప్రచురించడం జరిగిందని పెద్దాపురం వ్యవసాయ శాఖ అధికారిణి ద్వారక దేవి తెలిపారు. గురువారం పెద్దాపురం విఆర్వో కార్యాలయంలో రైతు భరోసా జాబితాను నోటీస్ బోర్డ్ లో ప్రచురించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి ద్వారకాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకం ఈనెల 15వ తేదీ నుంచి అమలులోకి రానున్నదని తెలిపారు.వీటికి సంబంధించి ఇప్పటివరకు రైతు భరోసా కింద మంజూరైన జాబితాను గ్రామ పంచాయతీలో ప్రచురించడం జరిగిందని తెలిపారు.జాబితాలో పేర్లు లేనివారు వాటికి సంబంధించిన ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్ కు సంబంధించిన జిరాక్స్ కాపీలను సంబంధిత వ్యవసాయ శాఖ కార్యాలయంలో గానీ, గ్రామంలోని వీఆర్వోలకు గానీ అందజేయాలని ఆమె తెలిపారు. ఈ పథకం కింద సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరుపున 12,500 భూమి యజమానికి, కౌలు రైతుకు వారి బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సాధికార సర్వేకి సంబంధించిన వివరాలు లేకపోవడం, బ్యాంక్ ఖాతా నెంబర్ లభ్యం కాకపోవడం వల్ల కొన్ని పెండింగ్ లో ఉంచడం జరిగిందని తెలిపారు.పరిపూర్ణమైన పూర్తి వివరాలు వ్యవసాయ కార్యాలయ అధికారులకు, విఆర్వోలకు రైతులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల ఏఈఓ ప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కర్రి సత్తిబాబు జన్మదిన వేడుకలు

## ముఖ్య అతిథిగా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సింహాచలం: 72 వ వార్డు వైసీపీ నాయకుడు మరియు సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు కర్రి సత్తిబాబు జన్మదిన వేడుకలు స్థానిక స్వామి కళ్యాణ మండపంలో బంధు మిత్రులు పార్టీ కార్య కర్తలు నాయకులు నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకరమానికి ముఖ్య అతిథిగా టూరిజం శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతర కేక్ కట్టింగ్ కార్య క్రమంలో పాల్గొని కేక్ తినిపించారు పుట్టిన రోజు సంధర్భంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు బెహరా భాస్కరరావు విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అదివివరం కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు కర్రి స్వామి 72వ వార్డు వైసీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రులు మహోత్సవములు



విశాఖపట్నం : విశాఖ ఉత్తర నియోజకవర్గం 14 వార్డు నక్కవనిపాలెంలో శ్రీశ్రీశ్రీ అభయ దుర్గాదేవి గుడి నవరాత్రి మహోత్సవములో భాగంగా 14వవార్డు అధ్యక్షురాలు జి.వి.రమణి అమ్మవారికి 100 (కళశాలు) బిందులు బహుకరించారు. అనంతరం రమణి గారి ఆధ్వర్యంలో కళశాలుతో గ్రామ తిరువీధుల్లో ఊరేగింపు కార్యక్రమం జరిగింది.ఈ కార్య క్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని ఊరేగిప్పు కార్యక్రమాన్ని మొదలుపెట్టిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఈ కార్యక్రమంలో జి.వి.రమణారెడ్డి, చిన్నారెడ్డి, చిన్నా, అశోక్‌రెడ్డి, శ్యామలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామూర్తిరెడ్డి, అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రులు సదస్సులో
కేంద్ర పాలిత ప్రాంతాలకు నూరు శాతం నిధులు ఇవ్వాలని కోరిన మంత్రి మల్లాడి

# వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## పరిరక్షణ బాధ్యత చేపట్టిన ఆర్డీవో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ తదితరులు



కంటి వెలుగు పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్డిఓ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ



ఎమ్మెల్యే స్వయంగా అ కంటి పరీక్ష తీరును చూస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ప్రజలందరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వారి కళ్లలో వెలుగులు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని శాసనసభ్యులు ఘనంగా ప్రారంభించారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా ప్రజలందరికీ సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, మరియు ఇతర కంటి వైద్య సేవలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవరత్నాలు లో భాగంగా ఈ కంటి వెలుగు పథకాన్ని నిర్వహించడం జరిగిందని, దశలవారీగా అక్టోబర్ 10 నుండి ప్రారంభమై డిసెంబర్ నెలాఖరు వరకు కంటి పరీక్షలు, అవసరం మేరకు శస్త్రచికిత్సలు, కళ్లద్దాల పంపిణీ, ఉచిత వైద్య సేవలు మొదటి దశలో రాష్ట్రంలో గల అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల ల లో విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మరియు కంటి వైద్య సేవలు అందించడం జరుగుతుందని విజయ భాను పత్రిక ప్రతినిధికి తెలిపారు. రెవిన్యూ డివిజనల్ అధికారి రోణంకి గోవిందరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 వ గురువారం ప్రపంచ ద ృష్టి దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు.స్థాయిలోనే ఈ కంటి పరీక్షలకు సంబంధించి ఆయా మండలాల ఎంఈఓలు, ఎంపీడీవోలు, వైద్య అధికారులు సంయుక్తంగా పాఠశాలలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 12వ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం విద్యార్థి యొక్క డేటా షీట్ తయారు చేసి అదే రోజు కంప్యూటర్ లో అప్లోడ్ చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ ప్రశాంతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, పాఠశాల చైర్మన్ లాలం వెంకట సత్య నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలత, మండల విద్యా శాఖా ధికారి, మండల అభివృద్ధి అధికారి, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థినిలు తదితరులు. పాల్గొన్నారు.

# మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడుగా పుక్కళ్ళ అమ్మోరు



భీమునిపట్నం: స్థానిక ఎగువ పేటలో ఉన్న పోలమాంబ అమ్మవారి గుడిలో మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్షుడుగా పుక్కళ్ళ అమ్మోరు, కార్యదర్శిగా పిరిపిల్లి ర మేష్, డైరెక్టర్స్ గా ఎస్ పోలిరా జు, పి. బాలా జీ, యు.మసేను,ఎస్ లక్ష్మణ,జి. ఎల్లా జీ, ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసు పల్లి.కొండ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పి.నరసింగ రావు, గ్రామ పెద్దలు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మహనీయుల విగ్రహాలు ఆవిష్కరణ

## -విగ్రహలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పర్వత



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు మాదిగ పేటకు చెందిన మాదిగ సంక్షేమ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన డా.బి.ఆర్.అంబేద్కర్ మరియు డా.బాబూ జగజ్జీవన రామ్ విగ్రహలను గురువారం ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్,మాజీ టీడీపీ మంత్రి కొత్తపల్లి.జవహర్,అన్నవరం దేవస్థానం చైర్మెన్ ఐ.వి.రోహిత్ కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పర్వత మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్,జగజ్జీవన్ రామ్, పూలే వంటి మహనీయుల ఆశయాలను మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. అలాగే మహనీయుల విగ్రహాలను పెట్టుకొని పూజించుకుంటున్నామంటే వారు తమ జీవితాలను పణంగా పెట్టి ఈ దేశానికి దిశా, నిర్దేశం చేసి అట్టడుగున ఉన్న వర్గాలను పైకి తీసుకొని వచ్చి మన జీవితాలకు వెలుగు నిచ్చిన ఘనత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మురళీమోహన్,స్థానిక వైసీపీ నేతలు శెట్టిబత్తుల.కుమార్ రాజా,దడాల.సతీష్,తాటిపాక.కృష్ణ,బిఎస్వీ.ప్రసాద్, ధారా.రమణ మరియు రాజాల చిట్టిబాబు, వీర్ల.సూరిబాబు, పలివెల.సతీష్, ఇండుగబల్లి నూకరాజు, పలివెల కొండలరావు, గంపల లోవరాజు, గుల్లా.దాసు, పలివెల రమేష్ మరియు మాదిగపేట పెద్దలు,యూత్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



భీమునిపట్నం : స్థానిక తగరపువలస అవంతి కళాశాలలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.డి.ఎస్.సి ఎస్.హెచ్.ఎ.ఆర్ డైరెక్టర్ పి.గోపీక ృష్ణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య మానవుని యొక్క సమస్యలను అంతరిక్ష పరిజ్ఞానం ద్వారా శాస్త్రీయ పరిష్కారం ఇచ్చేందుకు ఇస్రో ముందుకు ప్రయాణం సాగిస్తున్నదనీ అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు యొక్క ఘన విజయాలను వివరిస్తూ విక్రమ్ సారాభాయ్ 100వ పుట్టినరోజు ఉత్సవాలను గుర్తు చేస్తు అబ్దుల్ కలామ్, విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్ వంటి గొప్ప శాస్త్రవేత్తల కృషి,పట్టుదల, వారిలో గల దేశభక్తి విద్యార్థులకు తెలిపారు. ఈ వారోత్సవాలలో 25మంది ఇస్రో శాస్త్రవేత్తలు, 150మంది కళాశాల సిబ్బంది, 200మంది విద్యా ర్థులు శ్రమించి రెండు రోజులు కార్యక్రమాన్ని పూర్తి చేసారు. వివిధ కళాశాలలు, పాఠశాలలు నుంచి హాజరైన విద్యార్థులకు స్టూడెంట్స్ సింపోజియం, ఎలక్యూషన్,ఎక్స్ టెంపోర్ ,పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను సైన్స్ అంతరిక్ష పరిజ్ఞాన విభాగాలు పై పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఎస్.హెచ్. ఎ.ఆర్ డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించుటకు తగరపువలస మార్కెట్ మీదుగా భీమిలి రహదారి వైపు ఎస్.హెచ్. ఎ.ఆర్ బ ృందం, అవంతి విద్యాసంస్థలు భారీ ర్యాలీలో అనేకమంది సామాన్య ప్రజలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ఎస్ఎన్ వి గణేష్ మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక వేడుకలు విద్యార్థులను అనంత శిఖరాలను చేర్చేందుకు పునాదులు వేస్తాయనీ తెలిపారు.

ఇటువంటి అవకాశాన్ని విశాఖ జిల్లా ప్రజలకు కల్పించినందుకు ఇస్రో మరియు షేర్ బృందానికి,కళాశాల యాజమాన్యం, పర్యాటక శాఖ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావుకు, కళాశాల జనరల్ సెక్రటరీ ప్రియాంక,ఎమ్మీ శ్రావణ్ కుమార్,వైస్ ప్రెసిడెంట్, నందీష్, డైరెక్టర్స్ చంద్రశేఖర్,రాఘవరావు కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ఎంపీ గొడ్డేటి మాధవి



కొయ్యూరు : కొయ్యూరు మండలంలో రేవెళ్లు గ్రామంలో స్కూల్ ను, ఎంపీ మాధవి గురువారం ప్రారంభించారు. గతంలో ఇక్కడ ఎయిడెడ్ పాటశాల లో పనిచేసిన టీచర్ రిటైర్మెంట్ అవ్వటంతో ,స్కూల్ మూత పడింది. ఎన్నో సార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లిన , ఫలితం లేకపోయిదని, ఎంపీ మాధవి చొరవతో రేవెళ్ళు గ్రామంలో స్కూల్ రావటం తో గ్రామస్తులు, ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఎళ్ల కల నెరవేరి టంతో, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఎంపీ గొడ్డేటి మాధవి కొయ్యూరు లో సి. ఏ. హెచ్ స్కూల్లో వ్యాయామశాల ను ప్రారరించారు . రెజ్లింగ్ సెంటర్ లో విద్యార్థులు కు కావలసిన అవసరాలను ప్రభుత్వం కల్పిస్తుందని, గిరిజన ప్రాంతాన్ని, అభివ ృద్ధి పదంలో నడిపించి, గిరిజన విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని, వెలికతీసేందుకు , వ్యాయామశాల దోహద పడుతుందని మాధవి అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డైరెక్ట్ విజయ్ కుమార్ , స్పెషల్ ఆఫీసర్ పార్వతమ్మ, ఏపీ డబల్యు ఓ శ్రీనివాసరావు, ఎంపీడీపీ రెహమాన్, ఎం ఈ ఓ బొడం నాయుడు తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అప్పన్నకి మినీ బస్సు వితరణ




విశాఖ రూరల్ : స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా వారు శ్రీ వరహ లక్ష్మి నృశింహస్వామికి ఒక మినీ బస్సును బహుకరించారు .గురువారం ఎస్ బి ఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బి రమేశ్ బాబు (ముంబై ) ,జి ఎం బాస్కర్ (హైద్రాబాద్ ), స్థానిక సింహచలం బ్రాంచ్ మేనేజర్ సౌమిత్రి నేరుగా కొండపైకి చేరుకుని స్వామి దర్శనం చేసుకొని స్వామి గాలి గోపురంవద్ద ఆలయ కార్య నిర్వహణాధి కారి ఎం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా స్వామికి మినీ బస్సును బహుకరించారు.

కొండపైకి వచ్చిన ఎస్ బి ఐ ఉన్నతాధికారులకు ఆలయ ఈ ఓ పూర్ణకలశంతో స్వాగతం పలికి స్వామి అంతరాలయంలో వారి గోత్రనామలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు .

వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలుచేసి వారిని ఆశీర్వదించారు .అనంతరం ఈ ఓ వెంకటేశ్వరరావు స్వామివారి ప్రసాదాన్ని ,చిత్రపటాన్ని ఎస్ బి ఐ అదికారులకు అందచేశారు .

## బాక్సింగ్ క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



సింధియా: చైన్నైలో ఈ నెల 12,13వ తేదీలలో జరగనున్న ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసారు. గురువారం శ్రీహరిపురం సరస్వతి క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా భీమ్ సేన ప్రతినిధి యు.వి.రావు, జైభీమ్ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్ హాజరై సొంత నిధులతో క్రీడాకారులకు పండ్లు , ఫ్రూట్ జూస్‌లు, టూత్‌పేస్టు తదితర సామగ్రిని అందించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ కృషి, పట్టుదలకు క్రమశిక్షణ జోడించి క్రీడాకారులుగా ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానాన్ని సొంతం చేసుకొవాలని బంగారు పథకంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. కోచ్‌లు భీమసైనికుడు జి.రామారావు, సన్‌బాబులు ఈ పోటీలకు రిఫరీలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతంపై ఫోకస్ పెట్టండి






**( మొదటి పేజీ తరువాయి )** విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో కేడర్, నేతలతో చంద్రబాబు సమీక్షా సమావేశం నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రులు గంటా శ్రీనివాస రావు, చింతకాయల అయ్యన్న పాత్రుడులతో కలిసి బాబు సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలోపేతంతో పాటూ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. విశాఖ జిల్లా పర్యటన తర్వాత నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటిస్తారు. ఇదిలా ఉంటే విశాఖలో జరిగిన సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ కేడర్ , నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. బాబు మాట్లాడుతున్న సమయంలో.. కరెంట్ ప్రస్తావన రాగా.. ఈలోపే కరెంట్ కాస్త కట్. వెంటనే స్పందించిన టీడీపీ బాస్.. కరెంట్ విషయం మాట్లాడదామంటే కరెంట్ పోయిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎప్పుడైనా కరెంట్ కొరత చూడలేదని.. మళ్లీ చీకటి రోజులు వచ్చాయా లేదా అంటూ పార్టీ నేతల్ని ప్రశ్నించారు. మళ్లీ గుడ్డి దీపాల కోసం వెతకాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు చంద్రబాబు. తాను ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండేదని.. అప్పట్లో సంస్కరణలు తీసుకొచ్చి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. 2004లో మిగులు విద్యుత్ ఉంది.. తర్వాత ఓడిపోయాం.. 2014నాటికి రాజశేఖర్‌రెడ్డి, తర్వాత ముఖ్యమంత్రుల వల్ల 22.5 మిలియన్ యూనిట్ల కరెంట్ కొరత వారసత్వంగా మిగిలింది అన్నారు. మనం బాగా చేయడం.. మళ్లీ ఓడిపోవడం.. మళ్లీ వీళ్లు నాశనం చేయడం.. మళ్లీ దాన్ని సరి చేయడం ఇదే పని మనకు అంటూ చంద్రబాబు నవ్వుతూ చెప్పారు. ఐదేళ్లలో కరెంట్ రేట్లు కూడా పెంచమని చెప్పింది టీడీపీ ప్రభుత్వం మాత్రమేనని.. జగన్ ప్రభుత్వం పీపీఏల విషయంలో తప్పుడు ఆరోపణలు చేయాలని చూసిందన్నారు. తర్వాత కోర్టు కర్రు కాల్చి వాత పెట్టింది.. అయినా సిగ్గు రాలేదని ధ్వజమెత్తారు. కిందపడినా.. జగన్ ఇంకో లగు అంటున్నారని.. ఫ్యాన్ పనిచేయదు.. అందరూ విసనకర్రలు తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ చేతగాని తనం వల్లే విద్యుత్ కొరత వచ్చిందని.. భవిష్యత్‌లో కోలుకోలేని దెబ్బ పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణ మూర్తి, కిడారి శ్రావణ కుమార్, ఎమ్మెల్సీలు పప్పల చలపతిరావు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, పల్లా శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు ఎస్ఎ రెహమాన్, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు మరియు నగరానికి చెందిన పార్టీ ముఖ్యనేతలు, అబిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# డా. వైఎస్సార్ కంటివెలుగు చిత్రమాలిక







## హోంమంత్రి కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సీఎం జగన్



గుంటూరు : రాష్ట్ర హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. సుచరిత, దయాసాగర్ దంపతుల కుమార్తె రిషిక వివాహం తాడేపల్లిగూడెంకు చెందిన అద్దంకి విజయ్‌కుమార్, లీలా పరంజ్యోతి దంపతుల కుమారుడు దీపక్ కుమార్‌తో తణుకులో బుధవారం ఘనంగా జరిగింది. కాగా, గురువారం మంగళగిరిలో సీకే కన్వెన్షన్‌లో రిషిక-దీపక్‌ల రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరైన సీఎం వైఎస్ జగన్ నూతన దంపతులను ఆశీర్వదించి.. శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు మంత్రులు కూడా ఈ రిసెప్షన్‌కు హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సాహిత్యంలో నోబెల్ విజేతలు పీటర్, ఓల్గా



స్టాక్‌హోం : స్వీడిష్ అకాడమీ 2018, 2019 సంవత్సరాలకు సాహిత్యంలో నోబెల్ పురస్కారాలను ప్రకటించింది. గత ఏడాది సెక్స్ కుంభకోణం ఆరోపణలు రావడంతో 2018వ సంవత్సరానికి ఈ పురస్కారాన్ని ప్రకటించకుండా, వాయిదా వేసిన సంగతి తెలిసిందే. 2019వ సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ పురస్కారం ఆస్ట్రియన్ రచయిత పీటర్ హండ్కేకు దక్కిందని స్వీడిష్ అకాడమీ గురువారం ప్రకటించింది. 2018వ సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ విజేతగా పోలిష్ రచయిత్రి ఓల్గా టొకర్‌జుక్ నిలిచారని తెలిపింది.

హండ్కే విజేతగా నిలవడానికి కారణం ఆయన అత్యంత ప్రభావశీల రచన చేసినట్లు తెలిపింది. మానవ అనుభూతుల ప్రత్యేకత, అవధులను భాషాపరమైన చాతుర్యంతో వర్ణించారని పేర్కొంది. క్సీజీ జకుబొవే (ది బుక్స్ ఆఫ్ జాకోబ్స్) రచించిన ఓల్గా టొకర్‌జుక్ సాహిత్యంలో 2018వ సంవత్సరానికి నోబెల్ బహుమతి లభించింది. సమగ్ర భావావేశంతో పరిమితులను అధిగమించే జీవన విధానాన్ని వర్ణించే వివరణాత్మక ఊహా కల్పన ఆమె రచనలో ఉందని స్వీడిష్ అకాడమీ తెలిపింది. పోలిష్ నావలిస్ట్ ఓల్గా టొకర్‌జుక్ మొదటి నవల 1993లో ప్రచురితమైంది. ఆమె తరంలో ఆమె గొప్ప ప్రజాదరణ పొందిన నవలా రచయిత్రి. మొదటి ప్రపంచ యుద్ధం నుంచి 1980వ దశకం వరకు పోలండ్ చరిత్రను వివరించే ప్రైమ్‌వల్ అండ్ అదర్ టైమ్స్‌తో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. గత ఏడాది ఆమెకు మాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ లభించింది. ఆలోచనలు రేకెత్తించే రచనలు చేస్తారనే ఘనత హండ్కే సొంతం. 1975లో ప్రచురితమైన ఏ సారో బియాండ్ డ్రీమ్స్ గొప్ప ప్రజాదరణ పొందిన ఆయన రచనల్లో ఒకటి. సాహిత్యంలో నోబెల్ పురస్కార విజేతకు డిసెంబరు 10న స్వీడన్‌లో జరిగే కార్యక్రమంలో 9,12,000 డాలర్లు, ఓ పతకం అందజేస్తారు.

# విద్యుత్‌శాఖ నెంబర్‌వన్ : సీఎం కేసీఆర్

హైదరాబాద్: ప్రభుత్వం ప్రకటించిన 30రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో విద్యుత్‌శాఖ నెంబర్‌వన్ స్థానాన్ని ఆక్రమించిందని ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖరరావు ప్రకటించారు. గురువారం ప్రతిగతి భవన్‌లో జరిగిన మంత్రులు, కలెక్టర్ల సమావేశంలో సీఎం మాట్లాడారు. విద్యుత్‌శాఖ సిబ్బంది 30 రోజుల కార్యాచరణ ముగిసిన ప్పటికీ ఇంకా గ్రామాల్లో పనులు చేస్తూనే ఉన్నారని అభినందించారు. విద్యుత్‌అధికారులు, ఉద్యోగులు, కార్మికులను సీఎం అభినందించారు. నిర్ధేశించిన పనుల్లో ఇప్పటికే 60శాతానికి పైగా పూర్తిచేసిన విద్యుత్‌శాఖ, మిగితా పనుల కోసం ఇప్పటికీ గ్రామాల్లో విధులు నిర్వర్తించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

# గీతంలో మహిళా టెన్నిస్ పోటీలు ప్రారంభం

**హాజరైన డేవిస్ కప్ ఆటగాడు సాకేత్ మైనేని**




సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 12వ తేది వరకు దక్షిణ భారత దేశంలోని విశ్వవిద్యాలయాలకు నిర్వహించే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ (మహిళల) టెన్నిస్ పోటీలు గురువారం వందలాది మంది టెన్నిస్ క్రీడాకారిణుల సమక్షంలో అర్జున అవార్డు గ్రహీత, డేవిస్ కప్ భారత టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేని ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం సంయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ హాజరై క్రీడాకారిణులు పోటీలలో అత్యుత్తమ ప్రదర్శనతో తమ, తమ రాష్ట్రాలకు పేరుతేవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. గీతం స్పోర్ట్సు బోర్డుకార్యదర్శి పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా సహ తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి దాదాపు 45 విశ్వవిద్యాలయాకు చెందిన 200 మంది టెన్నిస్ క్రీడాకారిణులు 60 మంది మేనేజర్లు ఈ పోటీలకు హాజరయ్యారని పేర్కొన్నారు.అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్ నిబంధనలకు అనుగుణంగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ పర్యవేక్షణలో ఈ పోటీలను నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ టెన్నిస్ పోటీలలో మొదటి నాలుగు స్థానాలలో నిలిచే జట్లు డిసెంబర్‌లో గ్వారియర్‌లో జరిగే అఖిలభారత స్థాయి పోటీలకు అర్హత సాధిస్థాయని తెలిపారు.

**పీఎంసీ బ్యాంక్ ఖాతాదారులకు నిర్మల సీతారామన్ భరోసా**

ముంబై : పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ (పీఎంసీ) ఖాతాదారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ భరోసా ఇచ్చారు. ముంబైలోని బీజేపీ కార్యాలయం వెలుపల ఆందోళన చేసిన ఈ బ్యాంకు ఖాతాదారులను ఉద్దేశించి నిర్మల మాట్లాడుతూ తాను భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్‌తో మాట్లాడతానని, ఖాతాదారులు తమ సొమ్ము తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతానని చెప్పారు. నిర్మల సీతారామన్ గురువారం మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలకు సంబంధించి విలేకర్ల సమావేశంలో మాట్లాడవలసి ఉంది. ఈ నేపథ్యంలో పీఎంసీ బ్యాంక్ ఖాతాదారులు బీజేపీ కార్యాలయం వెలుపల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

# నేర నియంత్రణలో ప్రజలు సహకరించాలి

**ఫోర్త్ టౌన్ క్రైం ఎఎస్ఐ శామ్యూల్ రంగనాథ్**

**కరపత్రాల పంపిణీ**



విశాఖ క్రైం : ఇంటినేరాలు -- నివారణ చర్యలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగించేందుకు విశాఖపట్నం సిటీ ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం పోలీసు వారి ఆధ్వర్యంలో ఫోర్త్ టౌన్ క్రైం ఎఎస్ఐ శామ్యూల్ రంగనాథ్ ప్రత్యేక డ్రైవ్‌ను (అవగాహన) నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక అక్కయ్యపాలెం రైతుబజార్ పైరోడ్డులోగల నరసింహనగర్ ప్రాంతంలో వెహికల్ చెకింగ్ మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు మార్గంలోపోవు వాహనాలను ఆపి వాహన గుర్తింపు కార్డులను, వాహనదారుడి గుర్తింపు కార్డులను నిశితంగా పరిశీలించారు. ఆపై కరపత్రాలు పంపిణీ చేసి ఇంటి నేరాలు, సైబర్ నేరాలపై అవగాహనను ప్రజలకు కలిగించారు. పోలీసులకు సహకరించండి - దొంగతనాలను నివారించండి అనే నినాదంతో పై అధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించామన్నారు . సీసీ కెమెరాలు, భద్రత కలిగిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలి అన్నారు. వాహన దొంగతనాలు జరిగే ప్రదేశాలలో వీటిని ఉంచరాదన్నారు. సైబర్ నేరాల గురించి వివరిస్తూ మీరు బ్యాంకు ఖాతాలు డిపాజిట్ చేసినపుడు గానీ లేదా విత్‌డ్రా చేసినపుడు గానీ మీ ఏటీఎం సెంటర్‌ల వద్ద దొంగలు మిమ్ములను పసిగడుతూ ఉంటారు. ఆ విషయానిన గమనించి మీ పిన్ నెంబర్‌ను ఎవరికీ తెలియనివ్వకుండా తగు జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం సిబ్బంది శివ, నాగరాజు, అజయ్, కనకరాజు పాల్గొని వాహనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

# ప్రతిష్టాత్మకంగా వై.యస్.ఆర్.రైతు భరోసా

**- రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్**



శ్రీకాకుళం : రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా వై.యస్.ఆర్. రైతు భరోసా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ పేర్కొన్నారు. వై.యస్.ఆర్. రైతు భరోసా పథకం అమల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం సరుబుజ్జిలి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ ( PACS ) కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనసభాపతి తమ్మినేని సీతారాం ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న వై.యస్.ఆర్. రైతు భరోసా పథకాన్ని అమలుచేయబోతుందని చెప్పారు. ఈ పథకం క్రింద ఆర్థిక సహాయం పొందుటకు భూమిని సాగుచేసే రైతులందరూ అర్హులేనని అన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయేతర భూమి కలిగిన వారు, పి.ఎం.కిసాన్ లో అర్హత పొందిన వారు ఇందుకు అనర్హులని తేల్చిచెప్పారు. ఇటీవల భూమిని కొనుగోలు చేసి వెబ్ ల్యాండ్ నందు పేరు నమోదుకాకపోయినయిప్పటికీ అర్హులవుతారని, అలాగే ఆర్.ఓ.ఎఫ్.ఆర్, దేవాదాయ శాఖ భూములను లీజ్ క్రింద సాగుచేస్తున్నవారు, ఇనాం భూములు సాగుచేస్తున్నవారు కూడా అర్హులేనని శాసనసభాపతి స్పష్టం చేసారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని ప్రతీ రైతుకు మరియు కౌలు రైతుకు మేలు జరగబోతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతీ రైతు ఆనందంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి ధ్యేయమని శాసనసభాపతి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి మండల తహశీల్దారు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు కె.వి.జి సత్యనారాయణ,సురవరపు నాగేశ్వరరావు, బెవర మల్లేశ్వర రావు, శివానంద మూర్తి (బాబు ), మూడడ్ల రమణ మూర్తి, బద్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజలకు చేరువయ్యేందుకు ప్రత్యేక యాప్'

**విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు**

కృష్ణా : నియోజకవర్గంలోని ప్రజలకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నామని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వెల్లడించారు. సింగ్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మల్లాది విష్ణు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్టంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే నవరత్నాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. అర్హులైన పేదలకు రూ. 2250 పెన్షన్ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట మీద నిలబడి పేద ప్రజలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అన్ని పథకాలను ప్రతి ఇంటికీ చేరుస్తామని అన్నారు. వాహన మిత్ర ద్వారా జిల్లాలోని 5000 వేలకు పైగా ఆటో, ట్యాక్సీ కార్మికులకు రూ. 10000 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని పదమూడు మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 11 లక్షలు అందించామని మల్లాది విష్ణు తెలిపారు.

# సెమీస్‌లోకి దూసుకెళ్లిన మేరీకోమ్

**మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డు**



న్యూఢిల్లీ: మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. రష్యాలోని ఉలన్ ఉదె వేదికగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కొలంబియాకు చెందిన ఇంగ్రిత్ వెలెన్సియాపై 5-0 తేడాతో విజయం సాధించింది. మహిళల బాక్సింగ్ ప్రపంచ ఛాపింయన్‌షిప్ పోటీల్లో ఆరు స్వర్ణం, ఒక రజతం కలిపి మొత్తం ఏడు పతకాలు సాధించిన మేరీ కోమ్.. మరోసారి పతకాన్ని ఖాయం చేసుకుంది.

ఈ టోర్నీలో సెమీస్‌కు చేరడం ద్వారా కనీసం కాంస్య పతకం అయినా మేరీకోమ్‌కు దక్కే అవకాశం ఉంది. దీంతో వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఎనిమిది పతకాలు సాధించిన ఏకైక బాక్సర్‌గా మేరీకోమ్ చరిత్ర సృష్టించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 48 కేజీల కేటగిరీ లేకపోవడంతో తాజాగా మేరీకోమ్ 51 కేజీల కేటగిరీకి మారిన విషయం తెలిసిందే.

కాగా.. మేరీకోమ్ సెమీస్‌కు చేరడంపట్ల కేంద్ర మంత్రి కిరణ్ రిజుజి స్పందించారు. మహిళల వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటికే ఆరు బంగారు పతకాలు సాధించిన మేరీకోమ్.. మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# తండ్రి ఆరోగ్యశ్రీ.. తనయుడు కంటి వెలుగు

**- పేద ప్రజలకు మరో సంజీవని - వైకాపా ఎమ్మెల్యే రోజా**




చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం ఉన్న నాయకుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రోజా ప్రశంసించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె గురువారం చిత్తూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం పేద ప్రజలకు మరో సంజీవని వంటిదని కొనియాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకున్నారు.. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ రెండు అడుగులు ముందుకువేసి వైఎస్సార్ కంటివెలుగును ప్రారంభించారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ కంటి సంబంధిత జబ్బులు లేకుండా చూడాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని.. ఈ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రోజా పేర్కొన్నారు.






**ఘనంగా సంకు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు**



మురళీనగర్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కాపు నేత, నగర అధ్యక్షుడు సంకు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక పాపాహోంకు వెళ్లి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఉత్తరాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం

*రాగల 24 గంటల్లో వర్షాలుపడే అవకాశం*

అమరావతి: ఉత్తరాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావం వల్ల రాగల 24 గంటల్లో వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు జిల్లాల్లో విస్తారంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ముగిసిన తొలి రోజు ఆట..



పుణె: మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో ఇక్కడ మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. తొలి టెస్టులో డబుల్ సెంచరీతో అదరగొట్టిన ఓపెనర్ మయాంక్ అగర్వాల్ ఈ టెస్టులో సెంచరీతో చెలరేగాడు. 195 బంతులు ఎదుర్కొన్న మయాంక్ 16 ఫోర్లు, 2 సిక్సర్లతో 108 పరుగులు చేసి రబడ బౌలింగ్‌లో డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేసిన మరో ఓపెనర్ రోహిత్ శర్మ ఈసారి 14 పరుగులకే పెవిలియన్ చేరాడు. చతేశ్వర్ పుజారా 58 పరుగులు చేసి పరవాలేదనిపించాడు. భారత్ కోల్పోయిన మూడు వికెట్లు రబడకే దక్కడం గమనార్హం. ప్రస్తుత కెప్టెన్ కోహ్లీ 63, అజింక్య రహానే 18 పరుగులతో క్రీజులో ఉన్నారు.

**మరోసారి సెంచరీతో అదరగొట్టిన మయాంక్**

పుణె వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ మయాంక్ అగర్వాల్ సెంచరీతో సత్తా చాటాడు. టెస్ట్‌ల్లో రెండో సెంచరీ నమోదు చేశాడు. అయితే.. రబడ బౌలింగ్‌లో డుప్లెసిస్ క్యాచ్ పట్టడంతో అగర్వాల్ 108 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద పెవిలియన్ బాట పట్టాడు. 195 బంతుల్లో 108 పరుగులు చేసిన మయాంక్ 16 ఫోర్లు, 2 సిక్సర్లతో సౌతాఫ్రికా బౌలర్లను బెంబేలెత్తించాడు.

ఇప్పటికే విశాఖలో జరిగిన తొలి టెస్ట్‌లో తొలి డబల్ సెంచరీ హీరోగా మయాంక్ అగర్వాల్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. 2016 నవంబరు 17 నుంచి 21వ తేదీ వరకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ 167 పరుగులు చేయగా...ఇప్పుడు మయాంక్ అగర్వాల్ ఆ రికార్డును అధిగమించాడు. రెండో టెస్ట్‌లో కూడా సెంచరీతో అదరగొట్టడంతో మయాంక్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com